పేదలకు వరం.. సీఎం సహాయనిధి

పీఏసీ ఛైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



చెక్కునందజేస్తున్న పీఏసీ ఛైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: సీఎం సహాయనిధి పేదలకు వరం లాంటిదని పీఏసీ ఛైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. నియోజకవర్గంలోని పలువురు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఆరుగురికి రూ.3.18 లక్షల విలువ గల చెక్కులు మంజూరయ్యాయి. బాధిత కుటుంబ సభ్యులకు ఆదివారం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఆపదలో ఉన్నవారిని ఆపన్న హస్తంలా ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, దామోదర్‌రెడ్డి, సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లు తదితరులు

కూకట్‌పల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పిలుపునిచ్చారు. క్యాంపు కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గంలోని కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారు. డివిజన్లలోని సమస్యలు, జరుగుతున్న అభివృద్ధి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గెలిపించిన ప్రజలను ఎప్పటికీ మరువకూడదన్నారు. కార్పొరేటర్లు అందరూ ప్రజలకు అందుబాటులో ఉండి, ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని వివరించాలన్నారు. అభివృద్ధి పనులకు నిధుల కొరత ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలకు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా అండగా ఉండాలని సూచించారు. సమావేశంలో కార్పొరేటర్లు ముద్దం నరసింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీష్ గౌడ్, జూపల్లి సత్యనారాయణ, పగుడాల శిరీష బాబురావు, సబిహా బేగం, మందడి శ్రీనివాసరావు, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షులు మహ్మద్ గౌసుద్దీన్, మాజీ కార్పొరేటర్లు బాబురావు, తూము శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కులను అందజేసిన బండి రమేష్ తదితరులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలువురు ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. మంజూరైన రూ.4.32 లక్షల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ బాలానగర్ కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రిలీఫ్ ఫండ్ పథకం బడుగు, బలహీన వర్గాలకు ఆశా జ్యోతిలా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ లక్ష్మయ్య, ఏ బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి, అస్లాం, సునీల్ యాదవ్, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

వెలగని వీధి లైట్లు.. చీకట్లో కాలనీలు





చీకటిమయంగా ఉన్న తులసినగర్

వారం రోజులుగా ఇదే దుస్థితి

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ, తులసినగర్ కాలనీలో వీధి లైట్లు వెలగకపోవడంతో కాలనీలు చీకటిమయంగా మారాయి. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కావడం లేదు. దీంతో కాలనీల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడు వారాల నుంచి కాలనీలోని వీధుల్లో మొత్తానికే వీధి లైట్లు వెలగటం లేదని కాలనీ వాసులు పేర్కొన్నారు. వీధులన్నీ అంధకారంలో ఉండటంతో అర్ధరాత్రి వరకు మేల్కొని ఉండాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం స్థానికంగా ఉన్న పరికి చెరువు పాదల నుంచి ఆల్విన్‌కాలనీ నాలాలోకి కొండ చిలువ రావడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కూకట్‌పల్లి: మూసాపేట వాసులు, ప్రముఖ వ్యాపారవేత్త, తెలంగాణ మున్నూరు కాపు సంఘం నాయకులు తూము శ్యాంసుందర్ భార్య వనిత ఇటీవలే మృతి చెందారు. ఆదివారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ మూసాపేటలోని తూము శ్యాంసుందర్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, సప్పిడి భాస్కర్, నయీమ్, పాషా, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

పార్కు పనుల పరిశీలన

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీలోని పార్కుల అభివృద్ధి పనులను ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు గాదె శివ చౌదరి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం వెచ్చిస్తున్న ప్రజాధనం వృథా కాకుండా నాణ్యతా ప్రమాణాలతో పనులను పూర్తి చేయాలన్నారు. త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

నేడు పీఎఫ్ కార్యాలయంలో భవిష్యనిధి అదాలత్

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయం ఆధ్వర్యంలో సోమవారం భవిష్యనిధి అదాలత్ నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఆర్టీసీ బస్ టెర్మినల్‌లోని రెండవ అంతస్తులోని పీఎఫ్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉంటారని అన్నారు. ఖాతాదారులు తమ సమస్యలను పరిష్కరించుకోవడమే కాక సలహాలు, సూచనలు స్వీకరిస్తామని అన్నారు. కూకట్‌పల్లి, జీడిమెట్ల, సనత్‌నగర్, బీహెచ్ఈఎల్ తదితర ఖాతాదారులు పాల్గొనాలని సూచించారు.

త్వష్ట బ్రహ్మ పురస్కారానికి ఎంపిక



ఇత్తడితో నెమలిని తయారు చేయటంలో నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్న రామలింగాచారి

ఓల్డ్‌బోయిన్‌పల్లి: విశ్వకర్మ లీడర్ అవార్డ్స్ కార్యక్రమంలో భాగంగా ఇత్తడి, కంచు, రాగి, లోహ, శిల్ప నిర్మాణంలో నైపుణ్యాన్ని కనబరుస్తున్న బ్రహ్మశ్రీ పిట్టంపల్లి రామలింగాచారికి త్వష్ట బ్రహ్మ పురస్కారం అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ అవార్డును ఈ నెల 13వ తేదీన ఢిల్లీలోని బీఆర్ అంబేద్కర్ భవన్‌లో హర్యానా గవర్నర్ దత్తాత్రేయ చేతుల మీదుగా అందజేయనున్నట్లు తెలిపారు. ఇటీవల రామలింగాచారి అయోధ్య బాల రాముడికి పాదుకలు సమర్పించి దేశవ్యాప్త గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు. తనను ఈ పురస్కారానికి ఎంపిక చేసిన విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

కుమ్మరుల ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కెపి వివేకానంద్

చింతల్: చింతల్ డివిజన్ హెచ్ఎంటి కాలనీలో ఆదివారం నిర్వహించిన కుమ్మరుల(శాలివాహన) కార్తీక వనభోజన కార్యక్రమానికి వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జగద్గిరిగుట్ట శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, కుమ్మర సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజిగిరి దయానంద్, ఉపాధ్యక్షులు ఆర్. వీరేశం, శాలివాహన సంక్షేమ సంఘం నియోజకవర్గ గౌరవాధ్యక్షులు రాజవరపు శివన్నారాయణ, అధ్యక్షులు బాపనపల్లి నాగేశ్వరరావు, జనరల్ సెక్రటరీ రాపోలు సత్యనారాయణ, ఉపాధ్యక్షులు రాజవరపు శివప్రసాద్, కాశయ్య, కోశాధికారి పి. రాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మేయర్ నీలారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

నిజాంపేట్: స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలా రెడ్డి అన్నారు. ప్రగతినగర్ డాక్టర్స్ కాలనీ వెన్స హోమ్స్ అసోసియేషన్ సభ్యులు స్థానిక సమస్యలు, మౌలిక సదుపాయాల కోసం ఆదివారం మేయర్‌కు వినతిపత్రం అందజేశారు. అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరిస్తామని నీలారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో 4వ డివిజన్ నాయకులు సురేంద్ర కుమార్ యాదవ్, అసోసియేషన్ సభ్యులు శివ కుమార్ యాదవ్, నెహ్రూ, రవి వర్మ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష తమలపాకుల అర్చన



మూసాపేట: భరత్‌నగర్ కాలనీ హరిహరక్షేత్రంలో ఆదివారం దాసాంజనేయ స్వామికి లక్ష తమలపాకుల అర్చన ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసోత్సవంలో భాగంగా ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఆలయ అర్చకులు యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి సమక్షంలో ఆంజనేయ స్వామికి లక్ష తమలపాకుల అర్చన, పూజలు ఘనంగా జరిగాయి. అదే విధంగా కార్తీక మాసం రెండవ సోమవారం సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు, సామూహిక అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు కృష్ణ సూరి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

గోపాల్‌నగర్ టినిత్రోట్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

కూకట్‌పల్లి: తలసీమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల రక్షణార్థం ఆదివారం గోపాల్‌నగర్ టినిత్రోట్స్ ఆధ్వర్యంలో రక్తదానం నిర్వహించారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ నెల 17న కేపీహెచ్‌బీలో జరగబోయే రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు శివచౌదరి తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుకు విశేష స్పందన



సభ్యత్వ నమోదులో పాల్గొన్న బీజేపీ శ్రేణులు

మోతీనగర్: సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభిస్తుందని బీజేపీ మేడ్చల్ జిల్లా సెక్రటరీ పులిగొల్ల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం అల్లాపూర్ డివిజన్ శ్రీ వివేకానందనగర్‌లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రధాని నరేంద్ర మోదీ చేపడుతున్న సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులై బీజేపీ సభ్యత్వాన్ని తీసుకుంటున్నారన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, ఎం.వేణు, రామకృష్ణ, రాజు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

కూకట్‌పల్లి: బాలాజీనగర్‌లో ఫ్రీడం పార్కు ఏర్పాటుకు సహకరించిన అయినపరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని రెయిన్‌బో విస్టాస్ రాక్ గార్డెన్ అధ్యక్షులు బండి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. చంద్రశేఖర్‌రెడ్డి 2023 సంవత్సరంలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా ఫ్రీడం ఆయిల్ సంస్థలో విధులు నిర్వహిస్తున్నాడు. సీఎస్ఆర్ ఫండ్ ద్వారా కూకట్‌పల్లి ప్రాంతంలో ఏదైనా చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బాలాజీనగర్‌లో రూ. 2.75 కోట్ల వ్యయంతో పార్కును ఆహ్లాదకరంగా తీర్చిదిద్ది ఇటీవలే ప్రారంభించారు. దీంతో వారిని సన్మానించారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, శివనాగేశ్వరరావు, ఇంద్రారెడ్డి, అనిల్, అరవింద్‌రెడ్డి, సిద్ధారెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న బండి మధుసూదన్ రెడ్డి తదితరులు

శ్రీదత్తోపంత్ తెంగడి జయంతి వేడుకలు



కార్యక్రమంలో పాల్గొన్న ప్రాంత ప్రచార ప్రముఖ్ ఇన్‌చార్జి కేశవ్ సోని తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌లో ఆదివారం స్వదేశీ జాగరణ మంచ్ స్థాపకులు శ్రీదత్తోపంత్ తెంగడి జయంతి వేడుకలను నిర్వహించారు. ప్రాంత ప్రచార ప్రముఖ్ ఇన్‌చార్జి కేశవ్ సోని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్రీ దత్తోపంత్ తెంగడి జీవితం, విలువలు, ధ్యేయాల గురించి ప్రసంగించారు. కేశవ్‌సోని దత్తోపంత్ తెంగడి భారతదేశాన్ని ఆర్థికపరంగా శక్తివంతం చేయాలనే లక్ష్యంతో 1991లో స్వదేశీ జాగరణ మంచ్‌ను స్థాపించిన విషయాన్ని గుర్తు చేశారు. నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటుకు ప్రోత్సాహం అందించడంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. శ్రీ దత్తోపంత్ తెంగడి మార్గంలో నడుస్తూ ఆయన వారసత్వాన్ని కొనసాగిద్దామన్నారు. కార్యక్రమంలో ఆదిత్య, రామ్‌చరణ్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.



భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం పీఎస్ఎం స్కూల్‌లోని ఇందిరా చంద్రశేఖర్ ఆడిటోరియంలో ఉదయం 9:30 గంటలకు భారత్ కో జానో–2024 ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాయల్ గ్రూప్ ఆఫ్ కాలేజీ ఛైర్మన్ జనార్ధన్ రెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎన్. ముఖేశ్వరరావులు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అశ్విని సుబ్బారావు, కెఎస్‌వీఆర్ ప్రసాద్, సిహెచ్. హనుమంతరావు, పి. నరేంద్ర కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

– కూకట్‌పల్లి